ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
ఆదివారం 25 ఫిబ్రవరి 2024



ముగిసిన జాతర

● చివరి రోజు వన ప్రవేశం చేసిన అడవి బిడ్డలు ● భారీ సంఖ్యలో దరించుకున్న భక్తులు



పాలాసలోఅమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ధర్మపురి, ఫిబ్రవరి 23: ధర్మపురి గోదావరి నదీ తీరాన జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరా ఉత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజైన శనివారం సమ్మక్క, సారలమ్మలు వన ప్రవేశం చేయడంతో జాతర ముగినినట్లు అయింది. నాలుగు రోజులుగా భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం సమ్మక్క- సారలమ్మ దేవతలను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం సందర్శించారు. నిలువెత్తు బంగారం సమర్పించారు. సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మున్సిపల్ చైర్ ఎర్సన్ సంగి సత్యమ్మ, దేవస్థానం మాజీ ధర్మకర్త ఇనుగంటి వేంకటేశ్వర్ రావు, లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు రవీందర్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు శంకర్‌రాజు, ఉపాధ్యక్షులు అలకొండ చంద్రయ్య పాల్గొన్నారు.



మొక్కు చెల్లించుకుంటున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలంలోని పొలాస నర్సింహుల గుట్టపై సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాలను చివరి రోజు ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. నాలుగో రోజు కార్యక్రమంలో భాగంగా ఆలయం వద్ద బలిహరణము కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అమ్మ వార్లకు తులా భారాలు సమర్పించారు. ఆలయ కమిటీ ఈ ఆధ్వర్యంలో భక్తులకు వసతులు, సేవలు కల్పించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగిత్యాల (గొల్లపల్లి): గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు ఆడవి దేవతలను వన ప్రవేశం చేయించారు. జాతర ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు భక్తులు సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద నిలువెత్తు నల్ల బంగారం(బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవ కమీటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వెల్గటూర్: వెల్గటూర్, స్తంభంపెల్లి గ్రామాలలో నిర్వహిస్తున్న శ్రీ సమ్మక్క, సారలమ్మ జాతర ఉత్సవాలకు శనివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. ఉదయం వేళలో వివిధ గ్రామాల నుంచి చేరుకున్న భక్తులు అమ్మవారలకు మొక్కులు చెల్లించుకున్నారు. భారీగా తరలి వచ్చిన భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో సమ్మక్క, సారలమ్మ దేవతల గద్దెల చుట్టు ప్రదక్షిణాలు చేసి బంగారం సమర్పించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మెన్లు దండుగుల రాములు, రాంచంధర్ గౌడ్ ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు సారలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెగడపల్లి: మండలంలో వనదేవతల జాతర శనివారం ముగిసింది. నాలుగురోజులుగా జరుగుతున్న సమ్మక్క సారలక్కల జాతర ఉత్సవాలు శనివారం భక్తుల మొక్కుల అనంతరం వనానికి తరలడంతో వనదేవతల పండుగ ఘనంగా ముగిసింది.

ఎన్నికల్లో గెలుపు కోసమే సీబీఐ డ్రామా

జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న వసంత

జగిత్యాల, ఫిబ్రవరి 24(జగిత్యాల టౌన్): లోకసభ ఎన్నికల్లో గెలుపు కోసమే బీజేపీ సీబీఐ డ్రామా ఆడుతోందని జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత ఆరోపించారు. జడ్పీ క్యాంపు కార్యాయంలో వసంత విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్సీ కవితను రాజకీయంగా ఇబ్బందులకు గురి చేసి లబ్ధి పొందడమే ధ్యేయంగా బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కవిత నిందితురాలు కాదని కేవలం బాధితురాలు మాత్రమేనన్నారు. బెదిరింపులకు బీఆర్ఎస్ బయపడదన్నారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో 10 ఏళ్లుగా అధికారంలో ఉండి ప్రతి పక్ష పార్టీలకు చెందిన నాయకులను వేధింపులకు గురిచేస్తుందని ఆరోపించారు.

నేటి నుంచి టైలరింగ్, ఎంబ్రాయిడరి పరీక్షలు

జగిత్యాల, ఫిబ్రవరి 24 (జగిత్యాల టౌన్) : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఎగ్జామినేషన్స్ లో యర్, హైయ్యర్ గ్రేడులో టైలరింగ్, ఎంబ్రాయిడరి పరీక్షలు ఈ నెల 25 నుంచి 27వరకు నిర్వహించనున్నట్లు డీఈవో జగన్ మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 25న టైలరింగ్, ఎంబ్రాయిడరి లోయర్ గ్రేడ్, 26, 27 తేదీల్లో టైలరింగ్, ఎంబ్రాయిడరి హైయర్ గ్రేడ్‌లో పరీక్షలను ఉదయం 10 గంటల నుంచి మధ్నాహ్నం ఒంటి గంట వరకు, మధ్నాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయన్నారు. జిల్లా కేంద్రంలోని వాణి నగర్‌లో ఉన్న రామకృష్ణ హైస్కూల్‌తో పాటు పట్టణంలోని ధర్మపురి రోడ్‌లో ఉన్న సూర్య హైస్కూల్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వెబ్ సైట్ నుండి హాల్ టికెట్ పొందిన విద్యార్థులు సూర్య హైస్కూల్ ధర్మపురికి బదులు సూర్య హైస్కూల్ ధర్మపురి రోడ్ జగిత్యాల అని గమనించాలని కోరారు. అలాగే హైదరాబాద్‌లోని బేగంపేట, రామంతాపూర్‌లో ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతి ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు మార్చి12 లోగా జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ధరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వైభవంగా లక్ష్మినృసింహ స్వామి కల్యాణం

జగిత్యాల, ఫిబ్రవరి 24 (జగిత్యాల టౌన్) : జిల్లా కేంద్రంలోని 25వ వార్డులో ఉన్న శ్రీ లక్ష్మినృషింహ స్వామి కల్యాణ మహోత్సవాన్ని వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వేదికపై స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించగా భక్తులు కళ్యాణాన్ని తిలకించి ఓడి బియ్యం సమర్పించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

'విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి'

రాయికల్, ఫిబ్రవరి 24: విద్యార్థి దశ నుంచే నైపుణ్యంతో కూడిన విద్య అందించడం అభినందనీయమని, విద్యార్థుల్లో మరింత నైపుణ్యాలను పెంపొందించాలని తహసీల్దార్ మహ్మద్ అబ్దుల్ ఖయ్యూం అన్నారు. రాయికల్ పట్టణంలోని ఆర్ఆర్ ఆర్డెన్‌లో విస్డమ్ హైస్కూల్ ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు సత్య నాదెళ్లలాంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎస్సై అజయ్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు నిత్యం విద్యార్థుల పై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నివేదితరెడ్డి, ప్రెస్ జేఏసీ అధ్యక్షుడు వాసరి రవి, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్ పాల్గొన్నారు.

రాయికల్ పట్టణాభివృద్ధికి కృషి

●మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు

●రూ.15.96 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం

రాయికల్, ఫిబ్రవరి 24: రాయికల్ పట్టణంలో ఆదాయ వనరులను సమకూర్చుకుని పట్టణాభివృద్ధికి కృషి చేస్తామని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.15.96 కోట్లతో తయారు చేసిన బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సభ్యులందరు పరస్పర సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు కన్నాక మహేందర్, మారంపల్లి సాయికుమార్, తురగ శ్రీధర్‌రెడ్డి, వల్లకొండ మహేష్, మ్యాకల కాంతారావు, మ్యాకల అనురాధ, కో ఆప్షన్ సభ్యులు పిప్పోజి మహేందర్, పెండెల వనిత, మహ్మద్ అసియనిఖత్, మహ్మద్ మెరాజొద్దీన్, ఏఈ ప్రసాద్, జేఏవో శివ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి : ఎమ్మెల్సీ

జగిత్యాల, ఫిబ్రవరి 24 (జగిత్యాల టౌన్) : జగిత్యాల పట్టణంలోని ఎల్ ఎల్ గార్డెన్ నుంచి గుట్ట రాజేశ్వర స్వామి ఆలయం వరకు ఉన్న 60 ఫీట్ల రహదారి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్‌ను ఎమ్మెల్సీ కోరారు. జిల్లా కేంద్రంలో పలు రహదారులను అభివృద్ధి చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శనివారం కలెక్టర్‌తో పాటు టౌన్ ప్లానింగ్ డైరెక్టర్‌కు ప్రత్యేక లేఖను రాసి మాట్లాడారు. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా తులసీ నగర్, ధరూర్ క్యాంపు, అంతర్గాం వైపు నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే వాహనాలను బీట్ బజార్ వైపు వెళ్లకుండా గుట్టరాజేశ్వర స్వామి వరకు ఉన్న రహదారికి లింక్ చేసే విధంగా రోడ్డు విస్తరణ ఆమోదం ఉందన్నారు. ప్రతిపాదిత రోడ్డుకు ఆటంకాలు ఏర్పరిచే విధంగా ఉన్న అక్రమ నిర్మాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

అంజన్న భక్తుల గిరిప్రదక్షణ

మల్యాల, ఫిబ్రవరి 24: ప్రతి పౌర్ణమి పురస్కరించుకొని నిర్వహించే కొండగట్టు గిరిప్రదక్షణను శనివారం 11వ సారి భక్తుల చేశారు. చిలుకూరి బాలజీ శివాలయ ప్రధానర్చకులు సురేష్ ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో దిగువ కొండగట్టు నుంచి ప్రారంభమైన గిరిప్రదిక్షణ కొండగట్టు గుట్ట చుట్టూ గ్రామాల నుంచి కొండపైకి చేరుకుంది. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సాధువులు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మానవతా విలువలు ముఖ్యం

సినీ గేయ రచయిత అవార్డు గ్రహీత, సుద్దాల అశోక్‌తేజ

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 24 : సమాజంలోని మానవత విలువలు విద్యార్థులకు చాలా ముఖ్యమని, నేను ఇక్కడికి ముఖ్య అతిథిగా రావడం కంటే స్కూల్ టీచర్‌గా వచ్చానని చేప్పుకోవడం గర్వంగా ఉందని జాతీయ ఉత్తమ సినీ గేయరచయిత అవార్డు గహీత, తెలుగు భాషారత్నం సుద్దాల అశోక్‌తేజ అన్నారు. శనివారం మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుద్దాల అశోక్‌తేజకు గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికి ప్రజాప్రతినిధులు, నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో స్కూల్ టీచర్‌గా పని చేశాను. ఇక్కడే స్ఫూర్తి పొంది పాటలు రాయడం మొదలు పెట్టానన్నారు. పదవ తరగతి ఫైనల్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు మంచి ఆలోచనలతో చదివితే పరీక్షలు బాగా రాస్తారని పలు సూచనలు చేశారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం చెప్పిన విధంగా ప్రతి విద్యార్థి ఉన్నతమైన కలలను కని వాటిని సార్థకం చేసుకోవడానికి కృషి చేయాలన్నారు. భవిష్యత్‌ను ముందు ఉహించుకొని ముందు కెళ్లడం వలనే తాను ఈ స్థాయిలో ఉన్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అంకం స్వప్న-శంకర్, మాజీ సర్పంచులు జంగిటి అంజయ్య, జంగం స్వామి, మాజీ ఉపసర్పంచు రాజేందర్, వీడీసీ అధ్యక్షుడు రాజేందర్, శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో ఓటరు నమోదు సాధ్యం

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



ఓటరు నమోదు అవగాహన సదస్సులో పాల్గొన్న కలెక్టర్

జగిత్యాల , ఫిబ్రవరి 24(జగిత్యాల టౌన్): అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో పేరు నమోదు చేయించాల్సిన సామాజిక బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. కలెక్టరేట్ సముదాయంలో శనివారం క్యాంపస్ అంబాసిడర్‌లకు ఓటు హక్కు నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కళాశాల, విద్యా సంస్థల్లో చదువుతూ 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరి పేరును ఓటరుగా నమోదు చేయించాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అంబాసిడర్ల కృషితో 0.86 శాతం నుంచి 3.85 శాతం వరకు యువత పేర్లు ఓటర్లుగా నమోదు చేయించారన్నారు. ప్రస్తుతం 2.85 శాతం ఉందని 4 శాతం వరకు నమోదు శాతాన్ని తీసుకరావాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ బీఎస్ లత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చరిత్ర, ప్రజాస్వామ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజాస్వామ్య పరిపుష్టి చేయాల్సిన బాధ్యత యువతపై ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీనివాస రావు, స్వీప్ నోడల్ అధికారి లక్ష్మినారాయణ ఉన్నారు.

నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల, వసతి గృహాల నిర్మాణ పనులను శనివారం కలెక్టర్ పరిశీలించారు. నిరాణ పనుల మ్యాప్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. పనులను మరింత వేగవంతం చేసేందుకు గాను అవపరమైన ముడి సరుకును తెపించాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీనివాస రావు, కమిషనర్ అనీల్ బాబు ఉన్నారు.

లక్ష్మీ నృసింహ స్వామి కల్యాణం

రాయికల్, ఫిబ్రవరి 24: మండలంలోని షైతాపూర్ గ్రామంలో లక్ష్మీ నృసింహ స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఉత్సవ విగ్రహాలను అలంకరించి స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తలారి రాజేష్, బొమ్మెన బాబు, బాలయ్య, రాకేష్, లక్ష్మణ్, నాగరాజు పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని మన్నెగూడెం గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం లక్ష్మీ నృసింహ స్వామి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై లక్ష్మీ నృసింహ స్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయం

రాయికల్, ఫిబ్రవరి 24: గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయ మని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ మండల క్లబ్ ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్మన్ హన్మాండ్లు, ఎస్సై అజయ్, తహసీల్దార్ ఖయ్యూంలు క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ యువకుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడం శుభ పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, క్లబ్ కార్యదర్శి కురుమ సుదర్శన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి గట్టు రమేష్, నర్సయ్య, సాంస్కృతిక కార్యదర్శి వాసరి రవి, క్లబ్ సభ్యులు కురుమ మల్లారెడ్డి, తిరుపతి రెడ్డి, సదాశివారెడ్డి, పాల్గొన్నారు.

పాఠశాలలో నో బ్యాగ్ డే కార్యక్రమం

రాయికల్, ఫిబ్రవరి 24: మండలంలోని అల్లీపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల చార్ట్స్, క్రాఫ్ట్ పేపర్లు వాడి వస్తువులు తయారు చేశారు. సైన్ బోర్డులు, వాల్ ఫ్లవర్‌లు, ఫుడ్ ఫర్నీచర్‌లు తయారు చేశారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కస్తూరి భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు హరిప్రాద్, రవీందర్, ప్రసన్నలక్ష్మి, గంగాధర్, జగన్, జ్యోత్స్న, అంగన్‌వాడీ టీచర్‌లు శారద, మేఘమాల, రజిత పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జాతర

తాండ్ర్యాలలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం





లింగాపూర్‌లో రథోత్సవ వేడుకలు..పోతారంలో దర్శనం చేసుకుంటున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కథలాపూర్, ఫిబ్రవరి 24 : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం జాతరోత్సవాలు ఘనంగా జరిగాయి. తాండ్ర్యాలలో శ్రీవేంకటేశ్వరస్వామి, కలికోట, పోతారం గ్రామాల్లో శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతరలు ఘనంగా జరిగాయి. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. చుట్టు పక్కన గ్రామాలైన గంభీర్‌పూర్, పోసానిపేట, బొమ్మెన గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో స్వామివారి సన్నిధి కిటకిటలాడింది. కలికోట, తాండ్ర్యాల, పోతారం గ్రామాల్లో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, బీఆర్ఎస్ నియోజకవర్గ బాధ్యులు చల్మెడ లక్ష్మీనరసింహారావు వేర్వేరుగా స్వామివారి దర్శనం చేసుకున్నారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గడీల గంగ ప్రసాద్, మాజీ సర్పంచులు ధర్మపురి జలంధర్, దరావత్ సరోజసీతారాం, పులి హరిప్రసాద్, మండల కాంగ్రెస్, బీజేపీ పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని గ్రామాల్లోని మాఘ పౌర్ణమి శనివారం సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. రత్నాపూర్ గ్రామ శివారులోని మల్లికార్జున స్వామి ఆలయంలో జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైంది. గొర్రెపల్లి, ధాంరాజుపల్లి, వివిరావుపేట గ్రామాల్లోని లక్ష్మినరసింహ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో జరిగిన కల్యాణ వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని బోయవాడ కాలనీల్లో శ్రీ లక్ష్మినరసింహ స్వామి ఆలయం 29వ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉదయం నుంచి సుప్రభాతము, స్వామి వారికి అభిషేకాలు, తదితర కార్యక్రమానలు పురోహితులు జరిపారు. సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక పూజలు, ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పర్మి నర్సయ్య, ఆర్మూర్ నరేందర్, రాజేందర్, ప్రోహిర్ హేమాచందర్ పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలోని లింగాపూర్‌లో శనివారం శ్రీలక్ష్మీనర్సింహస్వామి రథోత్సవ వేడుకలు కన్నుల పండుగగా జరుపుకున్నారు. చివరి రోజైన శనివారం అందంగా అలంకరించిన రథంపై ఉత్సవ విగ్రహాలను ఉంచి రథోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఎంపీటీసీ శోభాతిరుపతి పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని మానాల శివారులో గల నల్లగుట్ట నరసింహస్వామి ఉత్సవాలలో భాగంగా శనివారం నృసింహుని రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మల్యాల, పెగడపల్లి, గొల్లపల్లి తదితర మండలాల నుంచి ప్రజలు తరలివచ్చి నృసింహున్ని దర్శించుకున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 24: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్న గుండం యాదగిరికి చెందిన ద్విచక్రవాహరం శనివారం అపహరణకు గురైందని బాధితుడు తెలిపాడు. మండల కేంద్రంలో మొదటి బైపాస్ రోడ్డు వద్ద ఓ దుకాణం ఎదుట బైక్ నిలిపి తాగునీటి పైపు లీకేజీ మరమ్మతు పనులు చేసేందుకు కందకంలో దిగానని తెలిపాడు. పనులు చేసి వచ్చి చూసే సరికి తన వాహనం కనిపించకుండా పోయిందని చెప్పాడు. చుట్టు పక్కల ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు గుండం యాదగిరి తెలిపారు. రంగంలోకి దిగిన పోలీసులు ద్విచక్ర వాహనం కోసం ఆరా తీశారు. మండలంలోని గొల్లపల్లి వద్ద ఓ వ్యక్తి వాహనంతో పట్టుబడ్డాడు. అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి జాతర



స్వామివారి పల్లకి సేవ

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 24 : మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం జాతర మహోత్సవం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో అర్చన అభిషేక కార్యక్రమాలను నిర్వహించిన వేద పండితులు స్వామి వారి కల్యాణాన్ని జరిపారు. వేంకటేశ్వర, లక్ష్మి, పద్మావతి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలను జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తులతో శోభాయాత్రను నిర్వహించగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ అమ్మాయి, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా చందనోత్సవం



చందనంతో అలంకరించిన స్వామి వారు

బీర్‌పూర్, ఫిబ్రవరి 24: బీర్‌పూర్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామి వారి సన్నిదిలో చందనోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అత్యంత భక్తి శ్రద్ధలతో మంత్రోచ్చారణల మధ్య లక్ష్మీ నరసింహ స్వామికి చందనాన్ని అద్ది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు ఎనగంటి సామ్రాట్, అర్చకులు సంతోష్, మధు కుమార్, సిబ్బంది రాజయ్య, వెంటేష్ పాల్గొన్నారు.

వైభవంగా నృసింహస్వామి

రథోత్సవం

మొక్కులు చెల్లించుకున్న వేలాది మంది భక్తులు



స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 24: భక్తుల కొంగు బంగారం కోర మీసాల సామికి కోటి దండాలంటూ శనివారం కొడిమ్యాల మండలం నల్లగొండ శ్రీలక్ష్మీనృసింహస్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. దిగువనున్న కోనేరులో భక్తులు స్నానాలు చేసి దిగువ, ఎగువనున్న స్వామి వారిని దర్శించుకుని, బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచే నల్లగొండ గుట్టకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా, తెలంగాణలోని పలు జిల్లాల నుంచి భక్తులు వచ్చారు. భక్తుల దర్శనార్థం ఆలయ చైర్మన్ సత్యనారాయణరావు, ఈవో వడ్లూరి అనూష, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారిని రథంపై భక్తుల దర్శనం కోసం ఆలయ ప్రాంగణంలో నిలిపారు. స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రథోత్సవానికి సుమారు 50 వేల మంది భక్తులు పాల్గొన్నట్లు అధికారులు భావిస్తున్నారు. గుట్టపైకి వచ్చిపోయే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ సమస్యను తొలిగించడంలో పోలీసులు ఇబ్బందులెదుర్కొన్నారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, పూడూర్ సింగిల్ విండో చైర్మన్ రమేష్, పలువురు అధికారులు స్వామి వారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతి ఆధ్వర్యంలో వాలంటీర్లు సేవలు అందించారు.



రథంపై స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



బారులు తీరిన భక్తులు

ఘనంగా గోవిందరాజులస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ శాశ్వత చైర్మన్ గోవిందరావు దంపతులు



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఆది శ్రీనివాస్

చందుర్తి, ఫిబ్రవరి 24 : మండలంలోని సనుగుల శివారులోని గుట్టపై వెలసిన గోవిందరాజుల స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామి వారిని దర్శించుకున్నారు. అనం తరం గోవిందరాజులస్వామి కల్యాణోత్సవం సంద్భంగా పట్టు వస్త్రలు సమర్పించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ శాశ్వత చైర్మన్ ఉప్పుగంటి శోభలత-గోవిందరావు దంపతులు స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. జడ్పీ చైన్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసన సభ్యులు మదన్ మోహన్‌రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహా రావు, జడ్పీటీసీ నాగం కుమార్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, సెప్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్, నాయకులు పొద్దుపొడుపు లింగారెడ్డి, అంచ రాం రెడ్డి, మ్యాకల గణేష్, తోట ఆగయ్య, మ్యాకల ఎల్లయ్య, లింగంపెల్లి కరుణాకర్, దుమ్మ అంజయ్య, ఏనుగు శ్రీనివాస్. చింతపంటి రామస్వామి, భీమా రాజు కనకరాజు, గొట్టె ప్రభాకర్, బొజ్జ మల్లేశం,ముస్కు ముకుందరెడ్డి, ముస్కు పద్మ-మల్లారెడ్డి, సురేందర్‌రావు, నెతికుంట జలపతి, భక్తులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రుక్మిణీ వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

ముస్తాబాద్: మండలంలోని బందనకల్ వాసుదేవాశ్రమంలో రుక్మిణీ వేణు గోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు, ఆలయ అర్చకులు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎల్‌ఎండీలోకి దూకి వివాహిత అత్మహత్య

తిమ్మాపూర్, ఫిబ్రవరి24: మండలంలోని ఎల్‌ఎండీలోకి దూకి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, తిమ్మాపూర్ సర్కిల్ సీఐ కర్రె స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన కొడెం రమేష్, కొడెం నందిని కొంత కాలంగా మండలంలోని మహాత్మా నగర్ గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం. రమేష్ మహాత్మా నగర్‌లోని మిషన్ భగీరథ ప్లాంట్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. అతని భార్య నందిని(40)కి గత కొంతకాలంగా మతిస్థిమితం లేకపోవడంతో అసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈ నెల 22న మధ్యాహ్నం 2గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయిన నందిని 24వ తేదీ శనివారం దిగువ మానేరు జలాశయంలో శవమై తేలింది. శనివారం జలాశ యం వద్ద మత్స్యకారులు మృతదేహాన్ని గుర్తించి ఎల్‌ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ఎల్‌ఎండీ ఎస్సై చేరాలు సిబ్బందితో చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతురాలు ఇంటి నుంచి తప్పిపోయిన నందినిగా గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నందిని ఇంటి నుంచి వచ్చి ఎల్‌ఎండీ వద్ద ఫినాయిల్ తాగి ఎల్‌ఎండీలో దూకి అత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. తన చావుకు ఎవరూ బాధ్యులు కాదని మృతురాలు నందిని రాసిన లేఖ లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వామి తెలిపారు.



కొడెం నందిత (ఫైల్)

ఐదు నెలల చిన్నారి ప్రతిభ

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు

ముస్తాబాద్, ఫిబ్రవరి 24: ఐదు నెలల చిన్నారి అద్భుత ప్రతిభతో అందరినీ అబ్బురపరుస్తోంది. బుడిబుడి అడుగులు కూడా నేర్వని చిన్నారి మేధాశక్తితో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సంపాదించింది. ముస్తాబాద్ మండల కేంద్రంలోని వేముల సౌమ్య-సాగర్ దంపతుల ఐదు నెలల కూతురు సంవేద్య. వృత్తిరీత్యా సంవేద్య తండ్రి హైదరాబాద్‌లో సివిల్ ఇంజినీర్‌గా, తల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. సంవేద్యకు రెండు నెలల వయస్సు నుంచే తల్లిదండ్రులు పలు రకాల వస్తువులపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా పండ్లు, జంతువులు, ఫ్లాష్ కార్డ్స్ వంటివి చూపించి వాటి పేర్లు చెప్పడం నేర్పించారు. ఐదు నెలలు రాగానే వస్తువులను, కార్డ్సును చూపించి పేరు చెప్పగానే వాటిని గుర్తిస్తోంది. ఆమె ప్రతిభకు నివ్వెరపోయిన వారు వీడియో తీసి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యాలయానికి పంపారు. వారు పరిశీలించి చిన్నారి సంవేద్య ప్రతిభను గుర్తించి గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. చిన్నారి అద్భుత మైన ప్రతిభను కుటుంబ సభ్యులతోపాటు ప్రముఖ వైద్యులు డాక్టర్ చింతోజు శంకర్, డాక్టర్ రాజారాం, చింతో జు నారాయణ అభినందిస్తున్నారు.



సంవేద్యకు వచ్చిన రికార్డ్సుతో కుటుంబ సభ్యులు



చిన్నారి సంవేద్య

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 24: ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లోని రైల్వే ట్రాక్‌పై శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియరాలేదు. ఆత్మహత్య చేసుకున్నాడా, ప్రమాదవశాత్తు రైలు కింద పడ్డాడా అని తెలియాల్సి ఉంది. ఎన్టీపీసీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ట్రాక్టర్ కిందపడి బీహార్ యువకుడి మృతి

కోనరావుపేట, ఫిబ్రవరి 24 : బీహార్ రాష్ట్రానికి చెందిన సుమిత్ చౌదరి (20) అనే యువకుడు ట్రాక్టర్ కిందపడి శనివారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన సుమిత్ చౌదరితోపాటు మరికొంత మంది సుద్దాల పత్తి మిల్లులో కొన్ని రోజులుగా పని చేస్తున్నారు. సుమిత్ చౌదరి స్నేహితుడు చందన్ కుమార్ శనివారం ఉదయం ట్రాక్టర్‌లో డీజిల్ పోయించి వెల్డింగ్ చేయించుకోవడానికి పత్తి మిల్లు నుంచి ట్రాక్టర్ తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో అక్కడే ఉన్న సుమిత్ చౌదరిని ఢీ కొట్టి ఈడ్చుకుపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి స్నేహితులు కాటన్ మిల్ యజమానులకు తెలుపగా వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు అజయ్ కుమార్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

జగిత్యాల, ఫిబ్రవరి 24(గొల్లపల్లి): మండలంలోని చిల్వాకోడూర్ వంతెన వద్ద జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన ఓరగంటి (బక్కుల) లచ్చయ్య (62) శనివారం మృతి చెందాడు. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపిన కథనం మేరకు..నిరుపేద కుటుంబానికి చెందిన లచ్చయ్య గ్రామంలో కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పనులు ముగించుకుని సైకిల్ పై ఇంటివైపు బయలుదేరాడు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దావన్‌పల్లి గ్రామానికి చెందిన పెద్ది మహేష్ అనే యువకుడు జగిత్యాల నుంచి ధర్మారం వైపు వస్తూ చిల్వా కోడూర్ వంతెన వద్ద లచ్చయ్యను బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో లచ్చయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. మహేష్ వంతెన పక్కన ఉన్న ముళ్ల పొదల్లో ఎగిరి పడ్డాడు. లచ్చయ్యను స్థానికులు, కుటుంబ సభ్యులు 108లో జిల్లా ప్రధానాసుపత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలో మృతి చెందాడు. లచ్చయ్య కొడుకు రమేష్ ఫిర్యాదు మేరకు పెద్ది మహేష్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 24: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 20మంది వాహనదారులను శనివారం కోర్టులో హాజరుపరచగా కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. ఇద్దరు వ్యక్తులకు మూడు రోజుల జైలుశిక్ష, 4,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 18 మంది వాహన దారు లకు రూ. 29 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.



కొత్తగట్టులో స్వామివారి దర్శనం కోసం క్యూలో భక్తులు

వైభవంగా మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

శంకరపట్నం, ఫిబ్రవరి 24: భూదేవి, నీలాదేవి సమేత శ్రీమత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శంకరపట్నం మండలం కొత్తగట్టు గుట్టపై కొలువైన శ్రీమత్స్యగిరీంద్ర స్వామిని దర్శించు కోవడానికి భక్తులు పోటెత్తారు. శనివారం పౌర్ణమి జాతరకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దాంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. పౌర్ణమి జాతరలో భాగంగా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోనేటిలో పుణ్యస్నానాలు ఆచ రించి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి, ఈవో సుధాకర్, ధర్మకర్తలు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

కమనీయం.. వేంకటేశ్వర స్వామి కల్యాణం



సింగాపూర్‌లో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 24: మండలంలోని సింగాపూర్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారి కల్యాణం కమనీయంగా సాగింది. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణ వేడుకను నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చిస్వామి వారి సేవలో తరించారు. స్వామి వారి కల్యాణానికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దంపతులు హాజరై స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను ఎమ్మెల్యే దంపతులకు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు దంపతులు అందజేశారు.



స్వామి వారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

వేంటేశ్వరస్వామి ఆలయంలో హుండీల అపహరణ

రంగంలోకి క్లూస్ టీం.. వేలిముద్రల సేకరణ

ధర్మారం, ఫిబ్రవరి 24: మండలంలోని దొంగతుర్తిలో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అర్థరాత్రి దొంగలు పడ్డారు. ఆలయంలో ఈనెల19న దేవతామూర్తల విగ్రహాలను ప్రతిష్ఠించారు. శుక్రవారం అర్థరాత్రి తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి గర్భగుడి ఆలయం తాళాలను పగులగొట్టారు. అందులో ఉన్న రెండు హుండీలను పగులగొట్టడానికి ప్రయత్నించారు. పగలకపోవడంతో రెండు హుండీలను ఎత్తుకెళ్లారు. గ్రామంలో సమ్మక్క-సారక్క జాతర దృష్ట్యా హుండీల లెక్కింపు చేయలేదు. హుండీల్లో భక్తులు సమర్పించిన దాదాపు 50వేల రూపాయలు, బంగారు ఆభరణాలు ఉంటాయని అంచనా. రామగుండం పోలీస్ కమిషనరేట్ నుంచి ప్రత్యేక క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించారు. శనివారం కేసు నమోదు చేసి దొంగల కోసం గాలింపు చర్యలు మొదలుపెట్టారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సత్యనారాయణ కోరారు.

317 జీవోపై ప్రభుత్వం సబ్ కమిటీ వేయడం హర్షనీయం

సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మాండ్ల భాస్కర్

గన్నేరువరం, ఫిబ్రవరి 24: రాష్ట్ర ప్రభుత్వం 317 జీవోపై ముగ్గురు మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో సబ్ కమిటీ వేయడం హర్షనీయమని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మాండ్ల భాస్కర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల లోపే ఉద్యోగ ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన 317 జీవోను పూర్తిగా అధ్యయనం చేసి ఉద్యోగ ఉపాధ్యాయులను ఆదుకోవాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని ఉద్యోగులందరూ ఆశిస్తున్నారని అన్నారు. సీపీఎస్ రద్దు కోసం కూడా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వంటగ్యాస్ లీకై మంటలు: తప్పిన ప్రమాదం

శంకరపట్నం, ఫిబ్రవరి 24: శంకరపట్నం మండలం కన్నాపూర్‌లోని ఓ ఇంట్లో వంట గ్యాస్ లీకై మంటలు అంటుకొని సామగ్రి దగ్ధమైంది. స్థానికుల వివరాల ప్రకారం దాసారపు రాధ ఇంటి నిర్మాణం చేసుకుంటూ తన తల్లి దేవునూరి పోచమ్మ ఇంట్లో ఉంటోందన్నారు. శనివారం సాయంత్రం రాధ వంట చేస్తుండగా రెగ్యులేటర్ దగ్గర గ్యాస్ లీకై ఒక్కసారి మంటలు ఎగిసి పడడంతో గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై గ్యాస్ సిలిండర్‌ను బయటవేశారన్నారు. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న సామగ్రితో పాటు ఇంటి పైకప్పు కూడా కాలినట్లు స్థానికులు తెలిపారు. రూ. 10వేల నగదుతో పాటు సుమారు రూ. 50వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



బయట పడవేసిన సిలిండర్

ప్రహరీని కూల్చిన కేసులో కృష్ణగౌడ్‌పై పీటీ వారెంట్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 24: రేకుర్తిలో ఓ ప్రహరీని కూల్చివేసిన కేసులో కార్పొరేటర్ భర్త సుధగోని కృష్ణగౌడ్‌ను శనివారం కొత్తపల్లి పోలీసులు పీటీ వారెంట్‌పై జైలు నుంచి కస్టడీకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. కరీంనగర్ మంకమ్మతోటకు చెం దిన ఎండీ అమీర్ అహ్మద్ అనే వ్యక్తి రేకుర్తిలోని సర్వే నంబరు 67లో ప్రహరీ నిర్మించగా దాన్ని సుధగోని కృష్ణగౌడ్ అక్రమంగా కూల్చివేశారని బాధితుడు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసులో కృష్ణగౌడ్‌ను పీటీవారెంట్‌పై జైలు నుంచి తీసుకువచ్చి కోర్టులో హాజరుపరచి, మళ్లీ జైలుకు తరలించినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 24: సిరిసిల్ల పట్టణ పరిధిలోని పెద్దూరు శివారు గ్రామమైన తర్లాశిపల్లిలో 70 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడు. గ్రామంలోని ఓ వ్యవసాయ భూమిలో శనివారం వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోలీసులు సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. ఎవరైన మృతదేహాన్ని గుర్తిస్తే 87126 56366 నంబరుకు ఫోన్ చేయాలని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

వలసకార్మికుడిగా గుర్తింపు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 24: సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్‌లో పడి ఉన్న మృతదేహాన్ని బీహార్‌కు చెందిన వలసకార్మికుడు చాంద్ సదన్‌గా గుర్తించామని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. సిరిసిల్లకు చెందిన మారుతి రైస్‌మిల్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. అతిగా మద్యం తాగి బస్టాండ్ వద్ద మృతిచెంది ఉంటాడని అతడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గర్జనపల్లిలో వృద్ధుడి మృతి

వీర్నపల్లి, ఫిబ్రవరి 24: వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో న్యాత పెద్ద రాములు (65) మృతి చెందాడు. వృద్ధుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన న్యాత పెద్ద రాములు శనివారం మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గ్రామ శివారులోని పాత చెరువుకుంట వ్యవసాయ భూమిలోని ఓ బావి వద్ద మేకల కాపరికి చెప్పులు, బట్టలు కనిపించడంతో అనుమానంతో బావిలోకి తొంగి చూశాడు. వృద్ధుడు పడి ఉండడాన్ని గమనించాడు. వెంటనే గ్రామస్థులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొని పోలీసుల సహాయంతో రాములును బయటకు తీశారు. గాయాలతో ఉన్న రాములు అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు, రాములు కుమారుడు కిషోర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

గాయపడిన యువకుడి మృతి

రాయికల్, ఫిబ్రవరి 24: రాయికల్ మండలం అయోధ్య గ్రామ శివారులో ఈ నెల 20న ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడగా పట్టణానికి చెందిన బత్తిని నాగరాజు (34) గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. నాగరాజు తన స్నేహితుడు చరణ్‌ను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ఉప్పుమడుగు నుంచి రాయికల్‌కు వస్తుండగా అయోధ్య గ్రామ శివారులో వాహనం అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో నాగరాజు మృతి చెందగా, చరణ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నాగరాజు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 24: పట్టణంలోని విద్యానగర్‌లో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు శనివారం రాత్రి పేకాట కేంద్రంపై పోలీసులు దాడులు జరిపారు. ఈ మేరకు పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 10,500ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.


సమ్మక్క గద్దె వద్ద మొక్కులు సమర్పిస్తున్న భక్తులు


ఆర్టీసీ బస్సుల్లో తిరుగు ప్రయాణమైన భక్తులు


ఆర్టీసీ ప్రాంగణానికి వెళ్తున్న భక్తులు


జంపన్నవాగులో పుణ్యస్నానమాచరించి తల్లులకు మొక్కుతున్న భక్తులు

చివరి రోజూ.. అదే జోరు..

- చివరిరోజూ మేడారానికి పోటెత్తిన భక్తులు
- తల్లులను దర్శించుకున్న స్పీకర్
- ప్రశాంతంగా దేవతల వనప్రవేశం
- ముగిసిన నాలుగు రోజుల జాతర
- ఊపిరి పీల్చుకున్న అధికారులు


చిన్నారికి జంపన్న జలాలతో పుణ్యస్నానం..


తిరుగుప్రయాణంలో బై బై చెప్తున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరకు చివరి రోజు కూడా భక్తులు లక్షల సంఖ్యలో తరలివచ్చారు. శనివారం సాయంత్రం తల్లులు వన ప్రవేశం చేయనుండడంతో వనదేవతలను దర్శించుకునేందుకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి, అదేవిధంగా పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి భక్తులు భారీ ఎత్తున చేరుకున్నారు. దీంతో క్యూలైన్లన్నీ కిటకిలాడాయి. గద్దెల ప్రాంగణం ఇసుకవేస్తే రాలనంతగా భక్తులతో కిక్కిరిసిపోయింది.



తల్లుల వనప్రవేశం

తల్లుల వనప్రవేశం ప్రశాంతంగా జరిగింది. శనివారం సాయంత్రం 5 గంటలకు సమ్మక్కను ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య చిలుకలగుట్టకు, సారలమ్మను కాక సారయ్య కన్నె పెల్లికి, అలాగే గోవిందరాజులను కొండాయి, పగిడిద్దరాజును పూనుగొండ్లకు తరలించారు. దీంతో మేడారం మహాజాతర ముగిసింది.

ప్రముఖుల రాక

మేడారానికి శనివారం కూడా ప్రముఖుల తాకిడి కొనసాగింది. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సమ్మక్క, సారలమ్మను దర్శించి మొక్కులు చెల్లించారు. హెలిక్యాప్టర్ ద్వారా మేడారానికి చేరుకున్న ఆయనకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ స్వాగతం పలికారు. స్పీకర్ తొలుత తులాభారం ద్వారా ఎత్తుబంగారాన్ని సమర్పించారు. అనంతరం తల్లుల గద్దెల వద్దకు వెళ్లి పూజలు చేశారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ సైతం వనదేవతలను దర్శించుకున్నారు.

ఆంధ్రజ్యోతి వన-జన జాతర February 21-24 2024

ధన్యవాదాలు తెలిపిన సీతక్క

జాతరను విజయవంతం చేయడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, వివిధ శాఖల అధికారులకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. జాతర ముగింపు సందర్భంగా శనివారం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. జాతర నిర్వహణకు అత్యధిక నిధులు ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్, ఎస్పీ, ఇతరశాఖల అధికారులను అభినందించారు.

సంప్రదాయ ఊరేగింపు

సమ్మక్క, సారలమ్మ జాతర ముగుస్తుండడంతో చివరి రోజు శనివారం మేడారంలో ఆదివాసీలు సంప్రదాయ ఊరేగింపు నిర్వహించారు. వివిధ కోయ జాతుల వారు సుమారు 300 మంది సంప్రదాయ దుస్తులు ధరించి ఉదయం సమ్మక్క గద్దెల వద్దకు చేరుకున్నారు. ఆదివాసీ పద్ధతిలో పూజలు చేశారు. అక్కడి నుంచి డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, కొమ్ముబూరలతో సంప్రదాయ నృత్యం చేస్తూ ముందుకు సాగారు. శివసత్తులు పూనకాలతో శిగాలూగారు.

ముగిసిన మహాజాతర

అంగరంగ వైభవంగా సాగిన మేడారం మహాజాతర శనివారం ముగిసింది. నలుగురు దేవతల వనప్రవేశంతో నాలుగు రోజుల సంరంభానికి తెరపడింది. భక్తులు తిరుగుబాట పట్టడంతో మేడారంలో గుడారాలన్నీ ఖాళీ అయ్యాయి. జనఘోషతో హోరెత్తిన జాతర ప్రాంతం తిరిగి నిశ్శబ్దం ఒడిలోకి జారిపోయింది. 'రెండేళ్లకు మళ్లీ వస్తాం తల్లీ.. కరుణించు' అంటూ మొక్కుకుంటూ భావోద్వేగంతో స్వగ్రామాల బాట పట్టారు.


మేడారం వెళ్లే రహదారిపై బారులుతీరిన వాహనాలు

షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కమిటీకి సన్మానం

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 24 : షుగర్‌ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు సన్మానించారు. శనివారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో మూసి వేసిన నిజాం షుగర్ ఫ్యాక్టరీని సందర్శించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈయన వెంటా నాయకులు జెట్టి లింగం, మహేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, షేక్‌మహమ్మద్, రమేష్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి చేయూత

పెగడపల్లి, ఫిబ్రవరి 24 : మండలంలోని రాములపల్లి గ్రామానికి చెందిన సుంకె మణెమ్మ లచ్చయ్యల కుమారుడు చిన్నారి వైద్యానికి శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయమందించి అండగా నిలిచింది. చిన్నారి ఊపిరి తిత్తుల వ్యాధితో బాధపడుతుండగా వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేని ఆ పేద తల్లిదండ్రులు నంచర్ల కేంద్రంగా నడుస్తున్న శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ ను ఆశ్రయించారు. ఈ మేరకు ట్రస్ట్ పసివాడికి ప్రాణం పోద్దాం పేరుతో గ్రూప్ సభ్యుల ద్వారా సేకరించిన రూ. 20,289 లను శనివారం చెక్కు రూపంలో బాధిత కుటంబానికి అందించారు. కార్యక్రమంలో ట్రస్ చైర్మన్ శ్రీనివాస్, కోశాధికారి లచ్చయ్య, సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

జగిత్యాల, ఫిబ్రవరి 24 (గొల్లపల్లి) : ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులు అధిక లాభాలు సాధించవచ్చని ఆయిల్ పామ్ సాంకేతిక సలహాదారు రంగనాయకులు పేర్కొన్నారు. శనివారం గొల్లపల్లి మండలం వెంగళాపూర్ గ్రామంలో ఆయిల్ పామ్ పంట సాగుపై ఉద్యానవన, పట్టుపరిశ్రమ, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంట సాగు పై, మొక్కలు నాటే కార్యక్రమంపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు అధిక లాభాలను ఇచ్చే పంటల సాగును అవలంబించాలని, పంటల మార్పిడి వల్ల భూ సాంద్రత పెరిగి పంట దిగుబడులు సాధించవచ్చొన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ విజయ్, నాయకులు కిషన్, మ ల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాయిమోద్దీన్, రైతు సంఘం నాయకులు సుదర్శన్ రెడ్డి, గంగారెడ్డి, మల్లారెడ్డి, అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

ఉప కాలువను పునరుద్ధరించిన అధికారులు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

జగిత్యాల, ఫిబ్రవరి 24 (గొల్లపల్లి) : గొల్లపల్లి మండలం బొంకూర్ గ్రామ రెవెన్యూ శివారులో 'ఎస్సారెస్పీ డీ-53 ఉప కాలువ కబ్జా' పేరిట ఈ నెల 19 న 'ఆంధ్రజ్యోతి' పత్రికలో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు డీఈ ధర్మకుమార్, ఎస్సారెస్పీ ఏఈ మహేష్, ఆర్ఐ జీవన్, సర్వేయర్ లక్ష్మన్ శనివారం సంఘటనాస్థలిని చేరుకుని కబ్జాకు గురైన కాలువను పరిశీలించారు. కూలీలతో ఉప కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. కబ్జాకు గురైన ఉపకాలువను సంబంధిత రైతులతో మాట్లాడి కాలువను పునరుద్ధరించారు. ఆయకట్టు కింది పంట పొలాలకు ఎస్సారెస్పీ సాగు నీరు అందేలా కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి' పత్రికకు బాధిత రైతులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రేణుక చౌదరిని కలిసిన యువజన కాంగ్రెస్ నాయకుడు

కోరుట్ల, ఫిబ్రవరి 24 : రాజ్యసభ సభ్యురాలుగా ఎంపికయిన రేణుక చౌదరిని శనివారం కోరుట్ల యువజన కాంగ్రెస్ ప్రదాన కార్యదర్శి కటకం చంద్రశేఖర్ కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. హైదరాబాదులోని గాంధీ భవనలో రేణుక చౌదరిని కలిసి శాలువాతో సత్కరించి స్థానిక పార్టీ పరిస్థితులపై రేణుక చౌదరికి వివరించినట్లు ఆయన తెలిపారు.

మూగజీవాలకు టీకా వేయించాలి

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 24 : పశుపోశకులు మూగజీవాలకు ఫైలేరియా వ్యాధి నివారణ టీకాలు తప్పకుండా వేయించాలని మండల పశు వైద్యాధికారి మనీషాపటేల్ సూచించారు. శనివారం మండలంలోని కొండ్రికర్ల, ఆరపేట గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరంలో ఫైలేరియా వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి హీమొ ప్రోటోజోవన్ పరాన్నజీవి ఫైలేరియా అన్యులేట్ వల్ల వస్తుందన్నారు. పశుపోశకులు ఉచిత టీకాలను మూగజీవాలకు తప్పకుండా వేయించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మురళి, రమ, చిరంజన్, దిలీప్, పశుపోశకులు, పాల్గొన్నారు.

విండో చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం

● సమావేశానికి సభ్యుల గైర్హాజరు

మల్యాల, ఫిబ్రవరి 24: మల్యాల సింగిల్‌విండో చైర్మన్ ఎం.రాంలింగారెడ్డిపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. చైర్మన్‌పై వైస్ చైర్మన్ మ్యాక బుజ్జమ్మతో పాటు మరో అరుగురు డైరెక్టర్లు సంత ప్రకాష్‌రెడ్డి, యాల్ల అనంతరెడ్డి, ఓరుగంటి రాజేందర్‌రెడ్డి, ఉత్తూరి తిరుమలేష్, అడువాల సురేష్, ఆకుల నగేష్‌తో పాటు సంఘ సభ్యులు మ్యాక లక్ష్మన్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్ ఈ నెల 7న జిల్లా సహకార అధికారికి అవిశ్వాస నోటీస్ అందజేశారు. అవిశ్వాసం నెగ్గడానికి 9మంది డైరెక్టర్లు అవసరం కాగ శనివారం జిల్లా సహకార అధికారి సత్యనారాయణ మల్యాలలో నిర్వహించిన అవిశ్వాస సమావేశానికి డైరెక్టర్లు గైర్హజరయ్యారు. అవిశ్వాస తీర్మానం అందించిన వారిలో ఆకుల నగేష్ తిరిగి చైర్మన్ శిబిరంలో చేరడంతో అవిశ్వాసం నెగ్గడానికి అవసర మైన సంఖ్యాబలం తగ్గింది. అవిశ్వాసానికి 9మంది అవసరం కాగ 8 మంది మాత్రమే ఉండడంతో వారంతా సమావేశంలో పాల్గొనలేదు. దీంతో గంట పాటు వేచి చూసిన అనంతరం అవిశ్వాస సమావేశానికి డైరెక్టర్లు గైర్హాజరవడంతో చైర్మన్ రాంలింగారెడ్డిపై అవిశ్వాసం వీగినట్లు జిల్లా సహకార అధికారి ప్రకటించారు. సమావేశం అనంతరం అసమ్మతి శిబిరానికి చెందిన సభ్యులు మ్యాక బుజ్జమ్మ, ప్రకాష్‌రెడ్డి, అనంతరెడ్డి, రాజేందర్‌రెడ్డి, తిరుమలేష్, సురేష్, నెళ్ల అరుణ, బట్టు విజయ్ విండో కార్యాలయానికి వచ్చి వెళ్లారు. ఈ సమావేశంలో విండో సీఈవో మిట్టపల్లి గోవర్ధన్ ఉన్నారు. అవిశ్వాస సమావేశం సందర్భంగా మల్యాల సీఐ, ఎస్సైల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు


విజయ సంకేతం చూపుతున్న విండో చైర్మన్, డైరెక్టర్లు

ఎరువుల దుకాణాల తనిఖీలు

మల్లాపూర్, ఫిబ్రవరి, 24 : మండలంలోని పలు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను శనివారం జిల్లా వ్యవసాయ అధికారి వాణి మండలాధికారి లావణ్యతో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. శనివారం మండలంలోని వేంపల్లి, మొగిలిపేట, రాఘవపేట గ్రామాల్లోని ఎరువల దుకాణాలలో నిల్వ చేసిన సరుకులు, లైసెన్సు పత్రాలు, రికార్డులను పరిశీలించారు. ఈ పాస్ బయోమెట్రిక్ పద్ధతిలోనే ఎరువులను విక్రయించాలని డీలర్లకు ఆదేశించారు. అనంతరం మల్లాపూర్‌లోని ఆయిల్ పామ్ పంటలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రతలను రైతులకు వివరించారు. ఏఈ వో గజానంద్, సిబ్బంది, యజమానులు, రైతులు, పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ భర్తపై సీబీసీఐడీచే విచారణ చేపట్టాలి

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 24 : మెట్‌పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ రానావేణి సుజాత భర్త సత్యనారాయణపై సీబీసీఐడీచే విచారణ చేపట్టాలని మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు పన్నాల మాధవరెడ్డి ప్రభుత్వాని కోరారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానావేణి సత్యనారాయణ గడిచిన నాలుగేళ్లలో పట్టణంలో దోచుకుంటూ ఆస్తులు పదింతలు చేసుకున్నడని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ప్రస్తుత కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌లతో 15 ఏండ్లలో ఎలాంటి భేదాలు లేవని, కానీ చైర్‌పర్సన్ భర్త వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ మునిగిపోయే నావ కాదు..

● మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కథలాపూర్, ఫిబ్రవరి 24 : బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ మునిగిపోయే నావ అని విమర్శిస్తున్నారని తమ పార్టీ తుఫానులో వచ్చే పడవ లాంటిదని రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని తాండ్ర్యాల, కలికోట, పోతారం గ్రామాల్లో జరిగిన జాతరలకు హాజరైన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఎంపీగా ఉన్న బండి సంజయ్‌కుమార్ ఏమి అభివృద్ధి. చేశారని బీఆర్ఎస్‌పై విషం కక్కుతున్నారని ప్రశ్నించారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించి నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద ఉన్న మూడు స్కీంలకుగాను కేవలం ఉచిత బస్సు వసతి మాత్రమే కల్పించి మిగిలిన రెండు విభాగాలను అమలు పరచడం లేదన్నారు. రైతులకు వచ్చే సీజన్‌కుగాను రు. 500 బోనస్‌కు సంబంధించి అదేవిధంగా రు. 500 సిలిండర్, పెన్షన్ రు. 4 వేలు, 6 వేల చొప్పున చెల్లించేలా పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ బాధ్యులు చల్మెడ లక్ష్మీనరసింహారావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి, జడ్పీటీసీ భూమయ్య, ఎంపీపీ రేవతి, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, విద్యాసాగర్‌రావు ఉన్నారు.

అలరించిన విద్యార్థులు ఆటా-పాట

కోరుట్ల, ఫిబ్రవరి 24 : పట్టణంలోని అరుణోదయ డిగ్రీ కళాశాల విద్యార్థులు చేసిన ఆటపాట కార్యక్రమం ఆహ్వానితులను అలరింప జేసంది. విద్యార్థులు కూచిపూడి... భరత నాట్యంతో పాటు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వచడంతో పీబి కళ్యాణ భవనం సందడిగా మారింది. కార్యక్రమానికి విచ్చేసిన వక్తలు విద్యార్థులకు విద్యా బోదనను వివరించి జీవితం రాణించడానికి చేయ్యవలసిన పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో కళశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపల్ పోతని నవీన్ కుమార్, ప్రైవేట్ పాఠశాల సంఘ నాయకులు బండి సంజయ్, సత్యనారాయణ, వేంకటేష్, కళాశాల డైరెక్టర్ల్ క్రొ రాజ్‌కుమార్, పోతని భవాని - నవీన్, సీనియర్ ఉపన్యాసకులు బట్టు హరికృష్ణల తో పాటు పలువురు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం

ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ రవీందర్

ధర్మపురి, ఫిబ్రవరి 24: తాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని రాజన్న సిరిసిల్ల సర్కిల్ ఆఫీస్ ఆర్‌డబ్ల్యుఎస్ ఇంట్రా అండ్ గ్రిడ్ ఎస్ఈ కె. రవీందర్ తెలిపారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని కమలాపూర్ బృహత్తర మంచి నీటి పథకాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి చెరువు పరిస్థితి, మంచి నీటి పథకం ద్వారా నీరందించే తీరు గురించి సంబంధిత అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ధర్మపురి పట్టణంలోని ఆర్‌డబ్ల్యుఎస్ సబ్‌డివిజన్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. కమలాపూర్ బృహత్తర మంచి నీటి పథకం కింద 14 ఆవాసాలకు నీరందిస్తున్నట్లు ఆయన తెలిపారు. తాగు నీటి నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసు కుంటామన్నారు. తాగు నీటి కోసం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రూ ఒక కోటి నిధులు మంజూరు చేసినట్లు ఆయన వివరించారు. ఈ నిధులతో ఆవాసాల సంఖ్య పెంచి నీటి సమస్య నివారించవచ్చని అన్నారు. తాగు నీటి సమస్య పరిష్కారం చేసేందుకు మూడు చోట్ల నుంచి నీరు డైవర్ట్ చేసుకునేలా అవకాశం ఉందన్నారు. డబ్బా, బోల్‌చెరువు, దర్మారం నుంచి నీరు తీసుకునే అవకాశం ఉందన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో తాగు నీటి సమస్య పరిష్కారం కోసం అన్ని విధాల సహకారం ఉంటుందని ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఇంట్రా అండ్ గ్రిడ్ జగిత్యాల ఈఈలు శేఖర్‌రెడ్డి, కె. సతీష్, డీఈఈలు మురళి, రోహిత్, ఏఈఈలు వివేకానంద, రాహుల్, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాయికల్ : విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జనమంచి శ్రీనివాస్ విద్యార్థులకు అశ్లీల వీడియోలు చూపించి అసభ్యంగా ప్రవర్తించేవాడు. విద్యార్థుల ఫిర్యాదు మేరకు డీఈవో జగన్మోహన్‌రెడ్డి విచారణ చేపట్టి శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రాయికల్ : మండలంలోని కుమ్మరిపెల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం క్లస్టర్ రిసోర్స్ పర్సన్ కుడుకల రవీందర్ పరిశీలించారు.

పెగడపల్లి : పల్స్ పోలియో విజయ వంతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పెగడపల్లి ఎంపీ డీవో ఏ.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కోసం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

కోరుట్ల: పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబల ఉత్సవ విగ్రహాలను అలంకరించి కళ్యాణం జరిపారు.

భీమారం: మండలంలోని ఒడ్యాడ్ గ్రామంలో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి కల్యాణం శనివారం కన్నుల పండువగా జరిగింది. వేద బ్రాహ్మణులు ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై లక్ష్మీ నృసింహ స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెగడపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి ప్రేమలతకు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. మండలంలోని బతికెపల్లి పంచాయతీ కార్యదర్శిగా పని చేసి సారంగాపూర్ మండలానికి బదిలీపై వెల్తున్న ప్రేమలతను సత్కరించి, ఆమె చేసిన సేవలను కొనియాడారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలంలోని అంబారిపేట వెంకటేశ్వర స్వామివారి 24వ వార్షిక బ్రహ్మోత్సవాలనులను ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●జగిత్యాల అర్బన్ మండలంలోని అంబారిపేట వెంకటేశ్వర స్వామివారి 24వ వార్షిక బ్రహ్మోత్సవాలను లను ఘనంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణమహోత్సవంలో పాల్గొని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మల్యాల: జగిత్యాల జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి నీలిమ శనివారం కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులతో పాటు ఏఎస్సై శ్రీనివాస్ ఉన్నారు

బుగ్గారం: బుగ్గారంలో ముత్యాల, నల్ల పోచమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం ఎడ్లబండ్ల పోటీలను ఏర్పాటు చేశారు. మొదటి బహుమతి పోట్టపల్లి సాగర్ అచ్చలపూర్ గ్రామం వారికి 4 గ్రాముల బంగారం, రెండవ బహుమతి సామిల్ సతీష్ భీమారం గ్రామం వారికి 2 గ్రాముల బంగారం, మూడో బహుమతి తుముల వెంకట రమయ్య పాత మంచిర్యాల గ్రామం వారికి 5 గ్రాముల వెండి అలయ కమిటీ సభ్యులు ప్రదానం చేశారు. జడ్పీటీసి బదినేని రాజేంధర్ ఉన్నారు.

●మండలంలోని సిరికొండ గ్రామంలో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను శనివారం బుగ్గారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేముల సుభాష్ ప్రారంభించారు.